క్లుప్తంగా

27న పోరుబాట

సదుం: కూటమి ప్రభుత్వంలో విద్యుత్ చార్జీల భారాన్ని నిరసిస్తూ పుంగనూరులో ఈనెల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరుబాట నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ ధనుంజయరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. వైఎస్సార్ విగ్రహం నుంచి నిర్వహించే ర్యాలీకి మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు తప్పక హాజరు కావాలని కోరారు.

శ్రీకృష్ణ ఆలయానికి రూ.10 లక్షల విరాళం


విరాళం ఇస్తున్న రామచంద్రయాదవ్, యాదవ సంఘ నాయకులు రెడ్డెప్పరెడ్డి

పుంగనూరు: పట్టణంలోని కృష్ణంరెడ్డిపల్లె రోడ్డులో గల శ్రీకృష్ణ ఆలయానికి రూ.10 లక్షలు విరాళం అందజేశారు. బుధవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. సమావేశానికి బీసీవై పార్టీ నాయకుడు రామచంద్రయాదవ్ హాజరై, ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో యాదవ సంఘ నాయకుడు రెడ్డెప్పరెడ్డి, ఎర్రప్ప, లింగమూర్తి, మునిరత్నం, వెంకటేశ్వర్‌రెడ్డి, గంగులమ్మ, ఆనంద్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: కానిస్టేబుల్ భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం వెలుగుచూసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు, నగరంలోని టి.చవటపల్లెకు చెందిన హేమంత్ చిత్తూరు ఆర్మడ్ రిజర్వు విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. హేమంత్ భార్య దేవి (40) గతంలో రెండు సార్లు ఆత్మహత్యకు యత్నించింది. తాజాగా మూడోసారి పిచోటపల్లిలోని బావిలో దూకి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

రేపటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్: ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో ఈ నెల 27వ తేదీ నుంచి రెండు రోజులపాటు జాతీయ స్థాయి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్, బంజారా జన్ సంఘ్ అధ్యక్షుడు హరిచౌహాన్ నాయక్ తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పౌరాణిక, సాంఘిక నాటికలు, శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు.

'నాడోడి బతుకులు' ఆవిష్కరణ


నవలను ఆవిష్కరిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: మూరిశెట్టి గోవింద్ రచించిన 'నాడోడి బతుకులు' నవలను రచయిత పలమనేరు బాలాజీ బుధవారం ఆవిష్కరించారు. యూత్ హాస్టల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ మాట్లాడుతూ యానాదుల ఆచార వ్యవహారాలు, సంస్కృతికి ఈ నవల దర్పణం పట్టిందని తెలిపారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన ఆచార్య పీసీ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో కూడా యానాది సామాజిక వర్గం అనాగరికులుగా మిగిలిపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం రా ష్ట నేత సాకం నాగరాజు, జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి, తిరువాయిపాటి రాజగోపాల్, గోవిందయ్య, డాక్టర్ మౌని, ఇస్లాపురం బాలసుబ్రమణ్యం, జీఎస్ ప్రసాద్, మునిప్రసాద్, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల జోరు

తిరుపతి అర్బన్: ధనుర్మాసం నేపథ్యంలో తిరుపతి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు జోరుగా అద్దెకు వెళుతున్నాయి. బుధవారం కాణిపాకం, శ్రీపురం, కంచికి మూడు సూపర్ లగ్జరీ సర్వీసులను అద్దెకు పంపినట్లు డిపో మేనేజర్ బాలాజీ తెలిపారు. ఎవరైనా ఆర్టీసీ సర్వీసులు అద్దెకు కావాలంటే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. సురక్షితమైన ప్రయాణం కోసం అంతా ఆర్టీసీ బస్సులను ఎంపిక చేసుకోవాలని కోరారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎస్వీయూ విద్యార్థులు

తిరుపతి సిటీ: చెన్నై ఎస్ఆర్ఎం వర్సిటీలో గురువారం నుంచి ప్రారంభం కానున్న సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీల్లో ఎస్వీయూ విద్యార్థులు పాల్గొననున్నారు. బుధవారం ఈమేరకు సాంస్కృతిక విభాగం కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ నేతృత్వంలోని ఎస్వీయూ బృందానికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆల్ ది బెస్ట్ చెబుతూ అభినందించారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్‌లో భాగంగా మహిళలకు ఉచితగ్యాస్ పథకం అమలు అబాసుపాలవుతోంది. పలమనేరు నియోజకవర్గంలోని మొత్తం రేషన్‌కార్డులో 30 శాతం మంది ఈ పథకానికి అర్హులుగా తేలారు. వీరికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. అయితే అర్హులైన వారిలో చాలామందికి గ్యాస్, బ్యాంకు ఖాతా, ఆధార్‌లింక్‌లతో పాటు ఈకేవైసీ లేనందున సాంకేతిక సమస్యలతో డబ్బు పడడం లేదని తెలుస్తోంది. అన్ని సక్రమంగా ఉన్నా గ్యాస్ తీసుకున్న 48 గంటల్లో నగదు పడేది కూడా కొందరికే. మిగిలినవారు నిత్యం మొబైల్‌లో బ్యాలెన్స్ చెక్ చేసుకోవాల్సిందే.





ఉచిత గ్యాస్ కొందరికేనమ్మా !

- పలమనేరులో 30 శాతం మందికే ఉచిత గ్యాస్ పథకం లబ్ధి
- ఈకేవైసీ లేనివారికి జమ కాని నగదు
- లబ్ధిదారులు ఒక సిలిండర్ బుక్ చేయాలంటే రూ.900 కట్టాలి
- కానీ ప్రభుత్వం ఇస్తోంది మాత్రం రూ.800 లే..!
- పోనీ ఆ డబ్బులు అయినా పడుతుందా అంటే డౌటే..!
- గ్యాస్ సిలిండర్ పొందిన 48 గంటల తరువాత కూడా పడని డబ్బులు
- లోలోన రగలిపోతున్న మహిళలు

పలమనేరు: అధికారం చేపట్టి ఆర్నెళ్లు కావొస్తున్నా సూపర్‌సిక్స్ పథకాల ఫలాలు ప్రజలకు చేరడం లేదు. సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ పథకం క్షేత్రస్థాయిలో మహిళలకు ఆగ్రహం తెప్పిస్తోంది. జిల్లాలో మొత్తం రేషన్ కార్డులు 5.43 లక్షలు ఉండగా, వీటిల్లో దీపం గ్యాస్ కనెక్షన్లు 2.45 లక్షల దాకా ఉన్నాయి. ఇక ఉజ్వల కింద 12 వేలు, జనరల్‌లో 3.21 లక్షలు ఉన్నాయి. మొత్తం మీద అన్ని రకాల గ్యాస్ కనెక్షన్లు 5.80 లక్షలు ఉన్నాయి. ఇక పలమనేరు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం రేషన్‌కార్డులు 55 వేల దాకా ఉండగా వీరిలో దీపం-2 పథకానికి అర్హత పొందిన వారు కేవలం 20 వేల మంది వరకే ఉన్నారు. దీపావళి కానుకగా దీపం-2ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆ మేరకు లబ్దిదారులు సిలిండర్‌కు రూ.950 చెల్లిస్తే వీరి ఖాతాల్లో ప్రభుత్వం వేసేది రూ.800 మాత్రమే. ఆ లెక్కన ఏడాదికి ఈ పథకం ద్వారా మూడు సిలిండర్లకు దక్కేది కేవలం రూ.2,400 మాత్రమే.

ఈకేవైసీదే అసలు పరుగులు..

గ్యాస్ సిలిండర్లు ఉన్న చాలామందికి ఈకేవైసీ కాలేదు. ఎందుకంటే గ్యాస్‌బుక్కులోని సెల్‌నంబరు, బ్యాంకుకు ఇచ్చిన నంబర్, ఆధార్‌లోని సెల్ నంబర్ ఒకటే ఉండాలి. వీటిని సంబంధిత గ్యాస్ ఏజెన్సీల ద్వారా ఈకేవైసీ చేసుకోవాలి. ఆపై వీరు గ్యాస్ బుక్ చేసి ముందుగా డబ్బుకట్టి సిలిండర్ పొందిన 48 గంటల్లో వీరి ఖాతాల్లోకి నగదు జమకాబడుతుంది. ఇందులో తిరకాసు ఏమిటంటే కుటుంబ సభ్యుల్లో ఎవరి పేరిట రేషన్‌కార్డు ఉంటుందో వారి పేరు మీదనే గ్యాస్ కనెక్షన్ ఉండాలి. ఒకే రేషన్‌కార్డులోని ఇద్దరు, ముగ్గురికి గ్యాస్ ఉంటే ఒక్కరికి మాత్రమే ఇది వర్తిస్తుంది. ఇందులో ఏదైనా సమస్యలు ఉంటే 1967 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయమన్నారు. దానికి కాల్ చేసినా పెద్దగా సమస్యలు పరిష్కారం కావడంలేదు.

గ్యాస్ ఏజెన్సీల వద్దకు జనం

నగదు కట్టి గ్యాస్ సిలిండర్ పొందినా.. 48 గంటల తరువాత కూడా డబ్బులు ఖాతాలో పడడం లేదని పలువురు మహిళలు నిత్యం గ్యాస్ కార్యాలయాల వద్దకు వెళ్లి విచారిస్తున్నారు. వారేమో తమకేమీ తెలియదని తాము గ్యాస్ పంపిణీ చేయడం వరకే అంటూ తిప్పి పంపుతున్నారు. అసలు అర్హులైన తమకు ప్రభుత్వం వేసే రూ.800 పొందాలంటే ఏమి చేయాలో వారికి దిక్కుతోచడం లేదు. బైరెడ్డిపల్లి మండలానికి చెందిన ఓ మహిళ తనకు గ్యాస్ డబ్బులు పడలేదని పలమనేరులోని ఏజెన్సీకి మూడు దఫాలు తిరిగింది. ఆపై పట్టణంలోని పోస్టాఫీసులో ఆధార్‌లింకు చేసుకుంది. ఈకేవైసీ సైతం రెండుసార్లు చేసుకుంది. ఇందుకోసం ఆమె కూలిపనులు వదులుకుని నాలుగురోజులు తిరిగినందుకు ఆమెకు రూ.1000 దాకా ఖర్చు అయిందట. కానీ ఆమెకు డబ్బు జమకాలేదు. ప్రభుత్వం ఇచ్చే రూ.800 కోసం ఇప్పటికే రూ.వెయ్యి పోగొట్టుకుని ఆ డబ్బు వద్దే వద్దు సామీ అంటూ మిన్నకుండిపోయింది. ఇలాగే ఎందరో గ్యాస్ డబ్బులు పడలేదని ఎవరికీ చెప్పుకోలేక, చేసేదిలేక మదనపడుతున్నారు.

వస్తే రానీ.. పోతే పోనీ..



నేను మొన్న నెలలో గ్యాస్ సిలిండర్ బుక్ చేసి దానికి డబ్బులు కట్టి తీసుకున్నా. నా ఖాతాలోకి డబ్బులు పడతాయని సిలిండర్ ఇచ్చే వాళ్లు చెప్పారు. కానీ ఇంతవరకు పడలేదు. ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియక వస్తేరాని పోతేపోనీ అని ఆశలు వదిలేసుకున్నా సామీ. –సరస్వతి, వీకోట

28న మున్సిపల్ సమావేశం

పుంగనూరు: మున్సిపాలిటీ సాధారణ సమావేశం ఈనెల 28న ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అలీమ్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. అలాగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు, సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

గంగమ్మా మన్నించు..


చౌడేపల్లె: చిట్రెడ్డిపల్లెలో రామాలయం ముందు దుర్వాసన వెదజల్లుతున్న మురుగునీరు

చౌడేపల్లె: నిత్యం పూజలు అందుకునే గ్రామదేవత గంగమ్మ ఆలయంతో పాటు రామాలయం ఎదుట మురుగునీటి నిలవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఆలయానికి వచ్చే భక్తులు ముక్కులు మూసుకుని రావాల్సిన పరిస్థితి. గంగమ్మా.. క్షమించమ్మా అంటూ వెళ్తున్నారు. ఈ దృశ్యం ఎక్కడో కాదు చౌడేపల్లె మేజరు పంచాయతీ చిట్రెడ్డిపల్లె గంగమ్మ ఆలయం వద్ద దుస్థితి. మురుగునీటి కాలువలు శుభ్రపరచకపోవడంతో కాలువలోని నీరు పొంగి ఆలయం ముందుకు చేరుతోంది. దుర్వాసనతోపాటు దోమలకు నిలయాలుగా మారాయి. జ్వరాలు ప్రబలక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పడిమెట్ల పూజకు విస్తృత ఏర్పాట్లు

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె కోటమలై అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరగనున్న పడిమెట్ల పూజోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుత్ దీపాలతో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. పెద్దసంఖ్యలో హాజరయ్యే భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నూతన కార్యవర్గాల ఎన్నిక


నాగరాజును సన్మానిస్తున్న నాయకులు


నూతనంగా ఎన్నికైన బీజేపీ నాయకులు

రొంపిచెర్ల: మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడిగా గెరిగ నాగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడి ఎంపిక జరిగింది. మోటుమల్లెల గ్రామ పంచాయతీలోని బేస్తపల్లెకు చెందిన నాగరాజను ఎంపిక చేశారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా నాగరాజ మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మాజీ ప్రధాని వాజ్‌పేయి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంతో నాయకులు నానబాల కుమార్, వెంకటరమణ నాయుడు, వెంకటరమణ, శేషాద్రినాయుడు, గోపికృష్ణ, వి.వి.సుధాకర్ రెడ్డి, అశోక్, చంద్రయ్య, రేవతి, మంగమ్మ, హరిప్రసాద్, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎంపిక

వి.కోట: మండల భారతీయ జనతా పార్టీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడిగా సోమశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బంగారురెడ్డి, ఉపాధ్యక్షులుగా మాధవ్, హేమంత్ కుమార్, మంజునాథ్ యతేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు. అలాగే కార్యదర్శులు మంజునాథ్ రెడ్డి, రాజప్ప, వెంకటేష్, విజయ్‌కుమార్, మంజునాథ్ కోదండ, కోశాధికారిగా ప్రభాకర్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆది

చౌడేపల్లె: భార్యాభర్తల మధ్య తలెత్తిన చిన్న వివాదం కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలో వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. దిగువపల్లె పంచాయతీ పక్షిరాజపురంలో దంపతులు ఆది(28), సత్య (22) నివాసం ఉంటున్నారు. అదే గ్రామానికి చెందిన వేరొక మహిళతో ఆది మాట్లాడాడని సత్య నిలదీసింది. నలుగురిలో సత్యను భర్త తిట్టడంతో అవమానకరంగా భావించిన ఆమె ఇంటిలో ఉన్న పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న భార్యను చూసి ఆది కూడా అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 సహాయంతో భార్యాభర్తలను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాజ్‌పేయికి నివాళి


వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

రామకుప్పం: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని బీజేపీ నాయకులు మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలో మాజీ ప్రధాని దివంగత వాజ్‌పేయి జయంతిని బుధవారం నిర్వహించారు. స్థానిక నాయకులు టీవీఎస్ ప్రసాద్, మఠంబాబు, నరసింహులు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


కరణం సంక్షేమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో బుధవారం కరణం సంక్షేమ సంఘం 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి, శ్రీకామాక్షి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆ సంఘం అధ్యక్షులు భాస్కర్‌పిళ్లై ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు షణ్ముగంపిళ్లై, తులసీకుమార్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యంపిళ్లై, సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి రవీంద్రప్రసాద్, కోశాధికారి సుబ్రమణ్యంపిళ్లై, కమిటీ సభ్యులు శంకరన్, హరిహరప్రసాద్, రవిచంద్ర, గురునాథం, లోకేష్, రుక్మాంగధ, లక్ష్మీనారాయణ, నాగేశ్వర్‌లాల్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో క్రిస్మస్

- పలమనేరు, పుంగనూరు, కుప్పంలో అంబరాన్నంటిన సంబరాలు
- పలుచోట్ల సేవాకార్యక్రమాలు
- ప్రత్యేక ప్రార్థనలు, సువార్తను బోధించిన మతపెద్దలు


పుంగనూరు: ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ రాకేష్

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, మండలాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించడంతో మూడు రోజులుగా విద్యుత్ దీపాలంకరణతో చర్చిలన్నీ మిరిమిట్లు గొలిపాయి. క్రిస్మస్ ట్రీలను ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల శాంతాక్లాజ్ వేషధారణతో వీధుల్లో తిరుగుతూ పిల్లలకు చాక్లెట్లను పంచి పెట్టారు. పండుగ సందర్భంగా అన్ని చర్చిలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మతపెద్దలు ఏసుప్రభు బోధనలను వినిపించారు. పలమనేరు కొత్త సీఎస్ఐ చర్చిలో జరిగిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను బుధవారం కోలాహలంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. రాజుపల్లి చర్చిలో నిర్వహించిన ప్రత్యేక పార్థనల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: మండలవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తిశ్రద్ధలతో చర్చిల్లో ప్రార్థనలు చేశారు. కరుణామయుడు ఏసుక్రీస్తు జన్మ వృత్తాంతాన్ని పాస్టర్ తిమోతీ ఉపదేశించారు.

ప్రత్యేక అలంకరణలో చర్చిలు..

పుంగనూరు: నియోజవర్గవ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పర్వదినం జరుపుకున్నారు. బుధవారం పట్టణంలోని సీఎస్ఐ చర్చి, మార్లపల్లెలోని డాన్‌బోస్కో చర్చితో పాటు పలు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించారు. చర్చి ఫాదర్ రాకేష్ నిమ్రోడ్ క్రీస్తు గొప్పదనాన్ని వినిపించారు. పేదలకు దుస్తులు, అన్నదానం చేశారు.

పులిచెర్ల(కల్లూరు)లో..

పులిచెర్ల(కల్లూరు): క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని కల్లూరు బీసీ కాలనీలో వేడుకలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలవ్యాప్తంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ పండుగను జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిట్రెడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ, శాంతమ్మ, దేవిప్రసాద్, బిందు దంపతులు చర్చి, ప్రభుత్వ ఆస్పత్రిలో పేదలకు దుస్తులు, దుప్పట్లు, స్వెటర్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

కుప్పంలో..

కుప్పంరూరల్: నియోజర్గవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు జరిగాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం చర్చిల్లో అన్నదానం నిర్వహించారు. ప్రేమ, త్యాగానికి ప్రతీక అని క్రిస్మస్ అని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. బుధవారం బీసీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో కుప్పం పట్టణంలోని షాలోమ్ చర్చిలో జరిగిన వేడుకల్లో పాల్గొని, పేదలకు నిత్యావసర సరుకులతో పాటు స్వీట్లు పంచిపెట్టారు.

శాంతిపురంలో..


శాంతిపురం: మండలంలో క్రిస్మస్ సందర్భంగా మంగళవారం రాత్రి నుంచి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. బుధవారం శాంతిపురంలోని ఎఫ్ఎంపీబీ చర్చిలో పాస్టర్ స్వామిదాస్ చింతల, సిస్టర్ నయోమి సువార్త చదివి వినిపించారు.

రామకుప్పంలో..

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంలోని హోలీ ఫ్యామిలీ చర్చిలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ చిన్నరాయప్ప క్రిస్మస్ సందేశాన్ని ప్రబోధించారు.




ప్రత్యేక అలంకరణలో బేబీ జీసస్, చర్చిల వద్ద ప్రత్యేక అలంకరణ


కల్లూరు చర్చిలో ఏసుప్రభువు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్ ధనరాజ్


చౌడేపల్లె: ప్రభుత్వాస్పత్రిలో రోగులకు దుప్పట్లను అందజేస్తున్న దాత వెంకటరమణ దంపతులు


కుప్పం: ప్రార్థనల్లో పాల్గొన్న క్రిస్టియన్లు


కుప్పం: నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న బీసీ నాగరాజు


పుంగనూరు: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు




పలమనేరు: బైబిల్ సారాంశాన్ని వివరిస్తున్న చర్చి ఫాదర్లు


ప్రార్థనల్లో పాల్గొన్న క్రిస్టియన్లు


రాజుపల్లి చర్చిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి


పొట్టగానిపల్లి చర్చిలో దుస్తులు పంపిణీ చేస్తున్న సుబ్రమణ్యం


బైరెడ్డిపల్లె చర్చిలో దైవ సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్